

## ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

కొందుర్గు, జూన్ 8 : మండల పరిధిలోని భైరంపల్లి వ్యవసాయ పొలాల్లో విద్యుత్ తీగలు వేళాడుతూ ప్రమాదకరంగా మారాయి. రైతులు, పాడి పశువులకు తగిలేంత ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలవల్ల ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనన్న భయాందోళనలో రైతులు ఉన్నారు. సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలను సరి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

## వికసిత సంకల్ప్ అభియాన్‌ను విజయవంతం చేయాలి

కేశంపేట, జూన్ 8 : బొంగులూరు గేట్ మంగళపల్లిలోని కల్లం జంగారెడ్డి గార్డెన్‌లో సోమవారం నిర్వహించ తలపెట్టిన వికసిత సంకల్ప్ అభియాన్ కార్యక్రమానికి మండలం నుంచి రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఏవో శిరీష ఆదివారం కోరారు. ఉదయం 10గంటలకు జరిగే కార్యక్రమానికి కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్‌చౌహాన్, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరవుతున్నారన్నారు. వ్యవసాయశాఖ శాస్త్రవేత్తలు, హార్టికల్చర్ అధికారులు, ఆయిల్‌ఫాం అధికారులు పలు సూచనలు, సలహాలు అందజేస్తారని, మండలంలోని ఆయా గ్రామాల్లోగల అభ్యుదయ రైతులు, ఆయిల్‌పాం సాగు చేసిన రైతులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

# ఆదర్శ పాఠశాలగా ఆరుట్ల ప్రభుత్వ బడి

**కొనసాగుతున్న అభివృద్ధి పనులు**
**పెరుగుతున్న న్యూ అడ్మిషన్లు**
**పాఠశాల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ**
**తీసుకుంటున్న ఎస్ఎంసీ**

మంచాల, జూన్ 8: కార్పొరేట్ పాఠశాలను తలదన్నే రీతిలో పాఠశాలను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం సంకల్పించింది. అంతర్జాతీయ విద్యా ప్రమాణాలతో కూడిన నాణ్యమైన విద్యను పేద విద్యార్థులకు అందియాలని లక్ష్యంతో రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి తోపాటు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడంతో నేడు పాఠశాల అభివృద్ధి పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి. మంచాల మండలం ఆరుట్ల ఉన్నత పాఠశాలను మాడల్ స్కూల్‌గా ఎంపిక చేశారు. ఇక్కడే జిల్లా పరిషత్, ప్రాథమిక, ప్రీ ప్రైమరీ, మాడల్ స్కూల్ ఒకే ప్రాంగణంలో ఉండడంతో ఈ స్కూల్ ను రాష్ట్రంలోనే మాడల్ స్కూల్‌గా ఎంపిక చేశారు. రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ 2024 సంవత్సరం డిసెంబర్‌లో ఆరుట్ల పాఠశాల సందర్శించి ప్రజల భాగస్వామ్యంతో పాఠశాలను అభివృద్ధి చేస్తానని తల్లిదండ్రులకు వివరించారు. దీనితో పాఠశాల ఆవరణలో విద్యా కమిషన్ చైర్మన్ తోపాటు అధ్యాపకులు పిల్లల తల్లిదండ్రులు, యువజన సంఘాల సభ్యులు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగస్తులతో ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. ఎస్ఎంసీగా రాష్ట్రంలోనే ఆదర్శ పాఠశాలగా గుర్తింపు పొందిన వరంగల్ జిల్లా మామిడి గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలకు ఆరుట్ల గ్రామస్తులు తీసుకువెళ్లి చూపించారు. అదేవిధంగా రంగారెడ్డి జిల్లా కొంగర రావిరాల్లో ఉన్న ఒక ప్రైవేటు కార్పొరేట్ పాఠశాలను కూడా పరిశీలించారు. దీంతో ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి, విద్యా కమిషన్ చైర్మన్ మురళితోపాటు కమిటీ సభ్యులు సైతం ఇటీవల ఆరుట్ల పాఠశాలను సందర్శించి ఈ పాఠశాలను పబ్లిక్ స్కూల్‌గా నామకరణ చేసి ప్రత్యేక నిధులు కేటాయించారు.



ఆరుట్ల ప్రభుత్వ పాఠశాల నమూనా



విద్యార్థుల తల్లిదండ్రులతో చర్చిస్తున్న విద్యా కమిషన్ చైర్మన్ మురళి (ఫైల్)

**ఇంగ్లిష్ మీడియానికి ప్రవేశం..**

తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటులో భాగంగా ఆరుట్ల పాఠశాలలో ప్రీ ప్రైమరీ స్థాయి నుంచే ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టనున్నారు. డిజిటల్ తరగతులకు గదుల నిర్మాణం పనులు జోరుగా సాగుతున్నాయి. అదేవిధంగా పాఠశాల ఆవరణలో గ్రీనరీ ఏర్పాటు కోసం జీఎంఆర్ సమస్థ ముందుకు వచ్చింది. అదేవిధంగా విశాలమైన క్రీడాస్థలానికి కూడా ఏర్పాటు చేశారు. 26 మందితో స్కూల్ మేనేజిమెంట్ కమిటీని ఏర్పాటు చేయడంతో వారు గ్రామంలో జోరుగా ప్రచారం నిర్వహించడంతో తెలంగాణ పబ్లిక్ స్కూల్లో చేర్పిస్తున్నారు. ఇప్పటికే పాఠశాలలో 570 మంది విద్యార్థులు ఉండగా, ఈ సంవత్సరం పాఠశాల పునః ప్రారంభంలోపే మరో 400 మంది విద్యార్థులు చేరేందుకు అడ్మిషన్లు కూడా తీసుకుంటున్నారు. మొత్తం మీద తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటుతో చుట్టుపక్కల గ్రామాల్లో ఉన్న విద్యార్థులు కూడా ఆరుట్ల పబ్లిక్ స్కూల్లో చేరేందుకు చాలామంది క్యూ కడుతున్నారు.

**పాఠశాలకు ఎస్‌డీఎఫ్ రూ.2కోట్లు విరాళం**

ఆరుట్ల పాఠశాల అభివృద్ధికి సోషల్ డెమొక్రటిక్ ఫోరం సంస్థ విరాళంగా రెండు కోట్ల రూపాయలను ఇచ్చింది. ఈ నిధులతో పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారు. ఇది గాక ప్రభుత్వం రూ.28 లక్షల రూపాయల నిధులు కేటాయించడంతో ఈ నిధులతో పాఠశాల ఆవరణలో సీసీ రోడ్లు, ప్రహరీ, లైబ్రరీ, క్రీడాస్థలాన్ని ఏర్పాటు చేస్తున్నారు.

**స్వచ్ఛందంగా బడిబాట..**



పాఠశాల అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం మరువలేనిది. తెలంగాణ పబ్లిక్ స్కూల్ అభివృద్ధి కోసం 26 మందితో అభివృద్ధి కమిటీ వేశారు. పిల్లలను పాఠశాలలో చేర్పించే తల్లిదండ్రులు ప్రతి ఒక్కరూ పాఠశాల అభివృద్ధి కోసం వెయ్యి రూపాయల కంట్రిబ్యూషన్ ఇవ్వాలి. ఇందుకు ప్రతి ఒక్కరూ సహకరించారు. బడిబాట కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయడమే కాకుండా పిల్లలను పాఠశాలలో చేర్పించారు.

- కంబాలపల్లి భాస్కర్ (ఆరుట్ల)

**దాతల సహకారం మరువలేనిది..**



తెలంగాణ పబ్లిక్ స్కూల్ అభివృద్ధికి దాతల సహకారం మరువలేనిది. అందుకు అనుగుణంగా ప్రణాళిక బద్ధంగా పనులు సాగుతున్నాయి. పాఠశాల అభివృద్ధికి ప్రజల భాగస్వామ్యంతో దాతల సహకారంతో ఇప్పటికే పాఠశాలలో టేబుల్స్, వాటర్ ఫిల్టర్ ఏర్పాటు చేశారు. పాఠశాల అభివృద్ధికి ఒక్కరి సహకారం మరువలేనిది.

- లాలగారి జంగయ్య (ఆరుట్ల)



## యువత వివేకానందుడిని ఆదర్శంగా తీసుకోవాలి

కడ్తాల్, జూన్ 8: యువత స్వామి వివేకానంద జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్ అన్నారు. తలకొండపల్లి మండల పరిధిలోని సంగాయిపల్లి గ్రామంలో వివేకానంద యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన, స్వామి వివేకానంద విగ్రహాన్ని ఆదివారం యువజన సంఘం నాయకులు, గ్రామస్థులతో కలిసి నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ యువత వివేకానంద చూపిన మార్గంలో నడవాలన్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచానికి చాటిన గొప్ప దేశ భక్తుడు ఆయన అని కొనియాడారు. వివేకానందుడి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్, ఆమనగల్లు మాజీ మాజీ జడ్పీటీసీ హరిప్రసాద్, నాయకులు నర్సింహ, శంకర్, ప్రభాకర్‌రెడ్డి, ముజీబూర్ రెహమాన్, రవిగౌడ్, అంజయ్య, పాండుప్రసాద్, కృష్ణ, శ్రీనివాసచారి, మోహన్‌రెడ్డి, అనంతరెడ్డి, జనార్ధన్‌రెడ్డి, ఉదయ్‌కుమార్, రవీందర్‌రెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు.

## ఆర్థికసాయం అందజేత

కడ్తాల్, జూన్ 8: ప్రతి ఒక్కరికీ బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని ఆ పార్టీ తలకొండపల్లి అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని గట్టుఇప్పలపల్లి గ్రామానికి చెందిన కోల ఎల్లమ్మ మృతి చెందింది. విషయం తెలుసుకున్న చంద్రశేఖర్‌రెడ్డి ఆదివారం బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఎల్లమ్మ మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం ఆయన బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.3వేలు ఆర్థిక సాయం చేశారు. పరామర్శించిన వారిలో పీఏసీఎస్ డైరెక్టర్ కృష్ణయ్య, బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు రాజు, నాయకులు కృష్ణయ్య, నర్సింహ, జీవా, ఆంజనేయులు ఉన్నారు.

## మృగశిర కార్తెతో చేపలకు ఫుల్ డిమాండ్

**కొనుగోలుదారులతో కిటకిటలాడిన చేపల మార్కెట్లు**
**రూ.600 ధర పలికిన కొరమీను**



షాద్‌నగర్ పట్టణంలోని పరిగిరోడ్డులో చేపలను కొనుగోలు చేస్తున్న ప్రజలు

షాద్‌నగర్‌టౌన్, జూన్ 8: మృగశిర కార్తె రోజున చేపలకు భారీ డిమాండ్ ఉంటుంది. ప్రతి ఏటా మృగశిర కార్తె రోజు ప్రతి ఒక్కరూ చేపలను తినేందుకు ఇష్టపడుతారు. మృగశిర కార్తె సందర్భంగా వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన చేపల మార్కెట్లలో ఆదివారం ఉదయం నుంచి జనాలు చేపలను కొనుగోలు చేశారు. చేప వ్యాపారస్తులు కొంత ధరలు పెంచినప్పటికీ కొనుగోలుదారులతో వారి వ్యాపారం లాభాసాటిగా కొనసాగింది. కొరమీను కేజీ రూ. 600, జెల్లలు రూ. 120–150, గ్యాస్‌కట్, రవ్వలు రూ.200, బొచ్చలు, బంగారు తీగలు, సిల్వర్, రూ.200, కంశేలు రూ. 250, రొయ్యలు రూ.400చొప్పున విక్రయించారు. సాధారణ రోజుల్లో కంటే కొంత మేర ధరలు పెంచి చేపలను అమ్మడం జరిగిందని వినియోగదారులు వాపోయారు.

**నాటుకోడి మాంసం కేజీ రూ. 400**

మృగశిర కార్తె సందర్భంగా చేపలతో పాటు నాటుకోడి మాంసానికి భారీ డిమాండ్ ఉంటుంది. షాద్‌నగర్ పట్టణంలో నాటుకోడి మాంసం కేజీ ధర రూ. 400 వరకు పలికింది. ఈ రోజున నాటుకోడి మాంసానికి భారీ డిమాండ్ ఉండడంతో వ్యాపారులు ధరలను పెంచారు. సాధారణ రోజుల్లో కిలో ధర రూ. 350 పలుకుతుండగా పండుగ రోజున ధరలను పెంచడం పట్ల వినియోగదారులు వాపోయారు.

చేవెళ్లటౌన్, జూన్ 8: చేవెళ్ల మండల కేంద్రంలో పెద్ద ఎత్తున చేపలను కొనుగోలు చేశారు. చేవెళ్ల మండల కేంద్రంలో చేపలు, చికన్, నాటుకోడి ధరలకు రెక్కలొచ్చాయి. చేపలు రూ.200 నుంచి రూ.250 పలుకగా, చికెన్ కిలో రూ.300 రేటు పలుకగా, నాటుకోడి కిలో రూ.700 ధర పలిగింది.

**ఇబ్రహీంపట్నం :** మండల పరిధిలోని మేడిపల్లి గ్రామ శివారులోని మత్స్యకారులు మిరుగు పండుగను పురస్కరించుకుని చెరువులో చేపలను పట్టి అక్కడే తక్కువ ధరకు చేపలను కిలోకి రూ.150కు విక్రయించడంతో ప్రజల చెరువు వద్దకు బారులు తీరారు. రైతులకు విత్తనాలు వేసేందుకు మిరుగు మొట్టమొదటి పండుగగా భావిస్తూ మిరుగు రోజున చేపలు తినేందుకు జనం ఆసక్తి చూపుతుంటారు.

ఇబ్రహీంపట్నం పెద్దచెరువులో ఆదివారం చేపల విక్రయాలు పెద్ద ఎత్తున కొనసాగాయి. ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం, అబ్దుల్లాపూర్‌మెట్ మండలాల్లోని పలు ప్రధాన చెరువుల్లో మత్స్యకారులు చేపలు పట్టి జోరుగా విక్రయించారు. మృగశిర కార్తె సందర్భంగా చేపలకు ఫుల్ డిమాండ్ సంతరించుకుంది.

**కడ్తాల్‌లో వెయ్యి దాటిన ధర..**

**కడ్తాల్ :** కడ్తాల్ పట్టణంలోని మార్కెట్‌లో కొర్రమీను కిలో ధర రూ.1,000 పలకగా, బంగారు తీగ, బొచ్చ రూ.300 వరకు పలికింది. గతేడాది కంటే ఈ యేడు చేపల ధర రెట్టింపు అయినట్లు ప్రజలు పేర్కొన్నారు.



కడ్తాల్ : మండల కేంద్రంలోని మార్కెట్‌లో..



షాద్‌నగర్ పట్టణంలో అమ్మేందుకు సిద్ధంగా ఉంచిన చేపలు

## మాగంటి మరణం తీరని లోటు

కడ్తాల్, జూన్ 8: జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అకాల మరణం బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటని బీఆర్ఎస్ కడ్తాల్ మండలాధ్యక్షుడు కంబాల పరమేశ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన, మాగంటి గోపీనాథ్ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పరమేశ్ మాట్లాడుతూ గోపీనాథ్ ఆకస్మిక మరణం ఎంతో బాధకరమని తెలిపారు. మూడు పర్యాయాలు జూబ్లీహిల్స్ ఎమ్మెల్యేగా నియోజకవర్గ ప్రజలకు ఆయన చేసిన సేవలు మరవలేనివని పేర్కొన్నారు. నివాళులర్పించిన వారిలో డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా, మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్, మాజీ ఎంపీటీసీ లచ్చిరాంనాయక్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ లాయక్ అలీ, మాజీ ఉప సర్పంచ్ పాండూనాయక్, నాయకులు రామచంద్రయ్య, మోబీన్, సుమన్, రామకృష్ణ, మహేశ్, శ్రీకాంత్‌నాయక్, ప్రశాంత్, శ్రీను ఉన్నారు.



గోపీనాథ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పరమేశ్, బీఆర్ఎస్ నాయకులు

## మాడ్గులలో భారీ వర్షం.. కూలిన చెట్లు

మాడ్గుల, జూన్8 : మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఆదివారం భారీగా వర్షాలు కురిశాయి. నర్సాయపల్లి గ్రామ సమీపంలో రోడ్డుకు పక్కల ఉన్న చెట్లు విరిగిపడి రోడ్డుకు అడ్డంగా పడ్డాయి. పెద్ద మాడ్గుల గ్రామంలో భారీగా వర్షం పడింది. దీంతో వ్యవసాయ భూముల్లో నీరు నిలిచింది. అధికారులు స్పందించి రోడ్డుకు అడ్డంగా పడివున్న చెట్లను తొలగించే విధంగా చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.



నర్సాయపల్లి గ్రామ సమీపంలో రోడ్డుపై కూలిన చెట్లు

## విరిగిపడిన చెట్ల తొలగింపు

కేశంపేట, జూన్ 8 : మండల పరిధిలోని కోనాయపల్లి, కొత్తపేట గ్రామాల మధ్య విరిగిపడిన చెట్లను గ్రామానికి చెందిన యువ నాయకుడు జి.సురేశ్ ఆధ్వర్యంలో తొలగించారు. కేశంపేట మండలంలో శనివారం భారీ ఈదురుగాలులతో కూడిన వర్షానికి రహదారికి ఇరువైపులా చెట్లు విరిగిపడి ప్రయాణికులు, వాహనదారుల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగించాయి. ఈ విషయమై స్పందించిన సురేశ్ తన సొంత డబ్బులు వెచ్చించి రహదారిపై అడ్డంగా పడిన చెట్లను తొలగించారు. కార్యక్రమంలో జంగయ్య, కృష్ణ, కిష్టయ్య, నర్సింహ, చెన్నారెడ్డి, రాములు పాల్గొన్నారు.



## మహాసభలను విజయవంతం చేయాలి

చేవెళ్లటౌన్, జూన్ 8: భారత కమ్యూనిస్టు పార్టీ 16వ మండల మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కే.రామస్వామి తెలిపారు. ఆదివారం చేవెళ్ల మున్సిపల్ కేంద్రంలోని ఆర్ అండ్‌బి గెస్ట్‌హౌస్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ చేవెళ్ల మండల 16వ మహాసభలు చేవెళ్ల పట్టణ కేంద్రంలోని సీపీఐ కాలనీ ఫేస్2లో నిర్వహించడం జరుగుతుందని, ఈ మహాసభలకు ముఖ్యఅతిథిగా సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య హాజరు అవుతారని తెలిపారు. ఈ సభల్లో నూతన మండల కమిటీని ఎన్నుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ఎం. సత్తిరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రభులింగం, కౌన్సిల్ సభ్యుడు సుభాన్‌రెడ్డి, సుధాకర్‌గౌడ్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, నాయకులు మక్బూల్ పాల్గొన్నారు.

## పోగొట్టుకున్న ఫోన్ అందజేత




ఆమనగల్లు, జూన్ 8: దయ్యాల బోడ్ తండాకు చెందిన తరుణ్ కొన్ని రోజుల క్రితం తన సెల్‌ఫోన్ పోగొట్టుకుని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్సై వెంకటేశ్ ఉత్తర్వుల మేరకు కానిస్టేబుల్ రఘునాయక్ సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఆ ఫోన్‌ను గుర్తించాడు. ఆ ఫోన్‌ను ఆదివారం ఫిర్యాదుదారుడు తరుణ్‌కు పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై అందజేశాడు.

## ఎర్రమట్టి అమ్ముకుంటున్న రైతులపై కేసు

శంషాబాద్ రూరల్, జూన్ 8 : ప్రభుత్వ భూముల్లో ఎర్రమట్టి అమ్ముకుంటున్న పలువురు రైతులపై రెవెన్యూ అధికారుల ఫిర్యాదుతో శంషాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కేసు నమోదు చేసినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. మండలంలోని మల్కారం,నానాజీపూర్, రాయన్నగూడ,పెద్దషాపూర్, చౌదర్‌గూడ గ్రామాల్లో ప్రభుత్వ భూముల్లో గుట్టుచప్పుడు కాకుండా ఎర్రమట్టిని అమ్ముకుంటున్నారు. దీంతో కొందరు వ్యాపారులను కొనుగోలు చేసి జేసీబీల సహాయంతో ప్రభుత్వ భూముల్లో పెద్దపెద్ద గుంతలు తీసి ఎర్రమట్టిని రాత్రికి రాత్రే వివిధ ప్రదేశాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నట్లు తెలిపారు. దీంతో ప్రభుత్వ భూముల్లో ఎర్రమట్టిని అమ్ముకుంటున్న కొందరు రైతులపై క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

## సిటీ రిపోర్టింగ్ రూం ప్రారంభం

మాదాపూర్ : కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్‌లో సీఆర్ పాలిక్ క్లినిక్ సిటీ స్కాన్ శ్రీసత్య బొల్లి ప్రొఫిలిక్స్‌తో ఈ సిటీ స్కాన్ 32–96 స్లైట్స్‌తో సిటీ రిపోర్టింగ్ రూం ప్రారంభించారు. సీఆర్ ఫౌండేషన్ గౌరవాధ్యక్షుడు, డాక్టర్ కే నారాయణ విచ్చేసి ఫౌండేషన్ కమిటీ సభ్యులతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ డెక్కన్ ప్రెసిడెంట్ జస్విందర్ బార్గి, కార్యక్రమ కో – ఆర్డినేటర్ నితీశ్, సీఆర్ఎఫ్ గౌరవాధ్యక్షుడు, డాక్టర్ నారాయణ, డిస్ట్రిక్ట్ గవర్నర్ శరత్‌చౌదరి పాల్గొన్నారు.

## ఘనంగా ఆత్మీయ సమ్మేళనం



ఆమనగల్లు, జూన్ 8: మండల కేంద్రంలోని వివేక విద్యాభారతి ఉన్నత పాఠశాలలో 2000–2001లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాటి గురువులను పూర్వ విద్యార్థులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం వారి జ్ఞాపకాలను విద్యార్థులతో ఉపాధ్యాయులు గుర్తుచేసుకున్నారు. సమ్మేళనంలో అప్పటి గురువులు వెంకటేశ్వరశర్మ, శివలింగం, చాంద్‌పాషా, యాదయ్య, పరంధాములు, మురళి, కన్నాజీ, ఆశాలత, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



ఆదిబట్ల, జూన్ 8: ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని మంగల్‌పల్లిలోని ఓ రిసార్ట్‌లో ఆదివారం ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. నగరంలోని బీఎన్‌రెడ్డి నగర్‌కు చెందిన చైతన్య జూనియర్ కళాశాల 2005 –2007 ఇంటర్ విద్యార్థులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



అత్తాపూర్‌లో బడిబాటలో పాల్గొన్న అత్తాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు

మైలార్‌దేవ్‌పల్లి, జూన్ 8: ప్రభుత్వ పాఠశాలల్లో విద్య నైపుణ్యాన్ని మరింత పెంచుతుందని అత్తాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు వెల్లడించారు. ఆచార్య ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు ఆదివారం కూడా అత్తాపూర్ పరిసర ప్రాంతాల్లో అవగాహన ర్యాలీ నిర్వహించి బడీడు పిల్లలను గుర్తించి వారిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడం వల్ల జరిగే ఉపయోగాలను తెలియజేశారు. అధునాతన టాయిలెట్స్, మంచినీటి సౌకర్యం, పిల్లలు ఆడుకునేందుకు ప్లే గ్రౌండ్, ఆట సామగ్రి, విశాలమైన తరగతి గదు లు, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు విద్యాబుద్ధులు నేర్పిస్తారని సూచించారు. నాణ్యమైన విద్యతో పాటు మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు, యూనిఫామ్‌లు సైతం ఉచితంగా అందిస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రోజారాణి, హేమలత, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



## పొంగి పొర్లుతున్న డ్రైనేజీ

చేవెళ్ల టౌన్, జూన్ 8 : చేవెళ్ల మున్సిపాలిటీ కేంద్రంలోని అయ్యప్ప స్వామి దేవాలయం పక్కన ఉన్న గణేశ్‌నగర్ కాలనీలో డ్రైనేజీ పైప్‌లైన్ లీకై పొంగి పొర్లడంతో దుర్వాసను కాలనీవాసులు భరించలేక పోతున్నారు. ఎన్నిసార్లు క్లీన్ చేసినా ఇదే పరిస్థితి ఏర్పడుతుందని వారు వాపోతున్నారు. పాత అండర్ డ్రైనేజీ పైపులు తీసి కొత్త వాటిని నిర్మించాలని కాలనీవాసులు కోరుతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు.